
ప్రజా విశ్వంభర V3 NEWS

కోస్తాంధ్రకు తరచూ తుపాన్ల ముప్పు.. శాశ్వత పరిష్కారం చూపాలి: చంద్రబాబు



విశ్వంభర, అమరావతి:మురసు తుపాను రాష్ట్రానికి రూ.2,484 కోట్లకుపైగా నష్టం మిగిల్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర బృందానికి తెలిపారు. 1.43 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, 1.86 లక్షల మంది రైతులు నష్టపోయారని వివరించారు. దెబ్బతిన్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసిన కేంద్ర బృందం.. ముఖ్యమంత్రితో వర్చువల్‌గా సమావేశమైంది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యులు.. రెండు బృందాలుగా విడిపోయి బాపట్ల, పల్నాడు, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో దాదాపు 60 ప్రాంతాలను సందర్శించారు. దెబ్బతిన్న పంట పొలాలు, రహదారులు, కాలువలు, ఇళ్లు, విద్యుత్ వ్యవస్థలను పరిశీలించారు. రైతులు, మత్స్యకారులతో నేరుగా మాట్లాడి నష్టం వివరాలు సేకరించారు. ఎల్‌నినో ప్రభావానికి తోడు ఒకేసారి రెండు తుపాన్లు రావడంతో రాష్ట్రానికి భారీ నష్టం జరిగిందని చంద్రబాబు కేంద్ర బృందానికి వివరించారు. తుపాను గమనాన్ని ముందుగానే అంచనా వేసి సహాయక చర్యలు చేపట్టామని, 24 గంటల్లోనే రహదారులు, విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్ సేవలను పునరుద్ధరించామని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రభావిత ప్రాంతాల్లో అదనపు రేషన్ కూడా పంపిణీ చేశామని చెప్పారు. కోస్తాంధ్రకు తుపాన్ల ముప్పు తరచూ ఉంటున్నందున శాశ్వత పరిష్కారంగా మౌలిక వసతులను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉం దని స్పష్టం చేశారు. ఇందుకు కేంద్రం ప్రత్యేకంగా సహకరిం చాలని కోరారు. పది రోజుల్లో నష్టంపై సమగ్ర నివేదిక సమర్పిం చాలని అధికారులను ఆదేశించారు. తాము పరిశీలించిన ప్రాం తాల్లో ఫ్లాష్ ఫ్లడ్స్‌తో గ్రామీణ రహదారులు, విద్యుత్ స్తంభాలు భారీగా దెబ్బతిన్నాయని కేంద్ర బృందం వెల్లడించింది. వరి పంటకు తూర్పుగోదావరిలో 80 శాతం, ఏలూరులో 90 శాతం వరకు నష్టం జరిగినట్లు గుర్తించామని తెలిపింది. మామిడి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకూ తీవ్ర నష్టం వాటిల్లిందని వివరించింది. పంటల బీమా ప్రీమియం అధికంగా ఉండటంతో పత్తి రైతుల్లో చాలామంది బీమా చేయించుకోలేకపోయారని తెలిపింది. కచ్చా ఇళ్లు కోల్పోయిన కుటుంబాలు, గిరిజనులు, ప్రకృతి వ్యవసాయ రైతులకు ప్రత్యేక సాయం అందించాలని సూచించింది.

సీబీఐ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారి కిడ్నాప్.. ఐదుగురి అరెస్ట్





విశ్వంభర, మదనపల్లె:
సీబీఐ అధికారుల పేరుతో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసిన ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు మదనపల్లె ఒకటో పట్టణ సీఐ మోహన్ కుమార్ తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని అగడ్తా వీధికి చెందిన సాధిక్‌ను ఈనెల 11న కర్ణాటకకు చెందిన కొందరు కిడ్నాప్ చేశారు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్ణాటక రాష్ట్రంలో ఓ కేసులో నిందితుడిగా ఉన్న సాధిక్.. తరచుగా అక్కడి కోర్టు విచారణకు హాజరయ్యేవారు. ఈ క్రమంలోనే చిత్తూరుకు చెందిన రాజ శ్రీనివాసులు అలియాస్ ఆర్ శ్రీనివాసన్‌తో సాధిక్‌కు పరిచయం ఏర్పడింది. సాధిక్ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భారీగా డబ్బు సంపాదించారని గుర్తించిన శ్రీనివాసన్.. ఎలాగైనా అతన్ని కిడ్నాప్ చేసి డబ్బు వసూలు చేయాలని పథకం రచించాడు. ఇందులో భాగంగా తిరుపతికి చెందిన వెంకటరమణకు సమాచారం ఇచ్చాడు. వెంకటరమణ కర్ణాటకకు చెందిన కొంతమందితో సాధిక్‌ను కిడ్నాప్ చేసేందుకు ప్రణాళిక రూపొందించాడు. ఈనెల 11న మదనపల్లెకు చేరుకున్న కిడ్నాపర్లు స్థానిక శ్మశాన వాటిక వద్దకు వెళ్తున్న సాధిక్‌ను కిడ్నాప్ చేసి కర్ణాటకకు తీసుకెళ్లారు. సీబీఐ అధికారులమని చెప్పి.. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఆదాయానికి మించి డబ్బు వసూలు చేసినట్లు తేలిందని, కేసు నుంచి తప్పించాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయం సాధిక్ కుటుంబ సభ్యులకు తెలియడంతో ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. కిడ్నాపర్లను పట్టుకునేందుకు ఎస్సై రహీముల్లా, మదనపల్లె రూరల్ ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నిందితులు.. బాధితుడి బంధువులు, స్నేహితుల వద్ద నుంచి రూ.26 లక్షలను తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. మిగిలిన డబ్బు తీసుకునేందుకు శనివారం రాత్రి కర్ణాటక నుంచి కారులో వస్తుండగా మదనపల్లె వద్ద పోలీసులు వారిని పట్టుకున్నారు. కిడ్నాపర్ల నుంచి సాధిక్‌ను విడిపించి మదనపల్లెకు తీసుకొచ్చారు. నిందితుల వద్ద ఉన్న కారు, నకిలీ తుపాకీ, సీబీఐ పేరిట ఉన్న నకిలీ గుర్తింపు కార్డులు, నకిలీ అరెస్టు వారెంట్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వెంకటరమణ పరారీలో ఉన్నాడని, అతన్ని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌కు అంతర్జాతీయ సొబగులు.. చివరి దశకు ఆధునికీకరణ పనులు

విశ్వంభర, తిరుపతి: ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుపతిలో రైల్వేస్టేషన్ సరికొత్త సొబగులద్దుకుంటోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేలా ఆధునిక హంగులతో సిద్ధమవుతోంది. సగటున రోజుకు లక్షన్నర మంది ప్రయాణికులు సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేలా రైల్వే స్టేషన్ ముఖచిత్రం మారబోతోంది. అంతర్జాతీయ స్థాయి స్టేషన్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రూ.342 కోట్లతో చేపట్టిన పనులు చివరి దశకు చేరుకున్నాయి.

రోజూ 1.50లక్షల మంది ప్రయాణికులు..

తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. విమానాశ్రయాలకు దీటుగా రైల్వేస్టేషన్లను ఆధునికీకరించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పనులు చేపట్టింది. తిరుపతి మీదుగా రోజూ దాదాపు 90 రైళ్ల ద్వారా 80వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు .ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల ద్వారా ఇకపై 1.50 లక్షల మంది ప్రయాణికులు సులభంగా, సౌకర్యవంతంగా రాకపోకలు సాగించనున్నారు. రూ.342 కోట్లతో నాలుగేళ్ల క్రితం అభివృద్ధి, ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. రైల్వేస్టేషన్ దక్షిణ ప్రవేశద్వారంతో పాటు నూతన భవనం, ఉత్తరం వైపు ప్రవేశద్వారం ఆధునికీకరణ పనులు చేపట్టారు. దక్షిణం వైపు పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఉత్తరం వైపు పనులు తుది దశకు చేరుకున్నాయి.

అత్యాధునిక వెయిటింగ్ హాళ్లు, స్టాల్స్..

దక్షిణం వైపు విశాలమైన అప్రోచ్ రోడ్లతో పాటు మూడంతస్తుల ప్రధాన భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. రెండో అంతస్తులో ప్రయాణికుల కోసం అత్యాధునిక వెయిటింగ్ హాళ్లు, స్టాల్స్,ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. మూడో అంతస్తును రైల్వే కార్యాలయాల కోసం కేటాయించారు. ఉత్తరం వైపు స్టేషన్ భవనాన్ని 3 అంతస్తులతో అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 3 లిఫ్టులు, 5 ఎస్కలేటర్లకు అదనంగా 25 లిఫ్టులు, 21 ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఫేజ్-2లో భాగంగా దక్షిణం వైపు ఉన్న మూడంతస్తుల భవనంపై మరో 10 అంతస్తుల భారీ భవనాన్ని నిర్మించనున్నట్లు స్టేషన్ డైరెక్టర్ తెలిపారు.తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు మరో 5 నెలల్లో పూర్తవుతాయని అధికారులు తెలిపారు. స్టేషన్ ఆధునికీకరణ, అభివృద్ధి పనులు పూర్తయితే తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి.



శ్రీవారి ఆలయంలో పుష్పయాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ

విశ్వంభర, తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం జరుగనున్న పుష్పయాగానికి ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా ఉదయం శ్రీవారి ఆలయంలో మూలవిరాట్ ఎదురుగా ఆచార్య రుత్విక్‌వరణం నిర్వహించారు. అర్చకులకు విధుల కేటాయింపునే రుత్విక్‌వరణం అంటారు. ఇందులో వైదిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతను అప్పగిస్తారు. సాక్షాత్తు శ్రీవారి ఆజ్ఞ మేరకు విధులు పొందినట్టు అర్చకులు భావిస్తారు.సాయంత్రం 6 గంటలకు శ్రీవారి సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనుల వారిని ఆలయం నుంచి వసంత మండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించి తిరిగి శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. అంకురార్పణం కారణంగా సహస్రదీపాలంకార సేవను తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నవంబరు 16న పుష్పయాగం..

శ్రీవారి ఆలయంలో సోమవారం పుష్పయాగం సందర్భంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవర్లను సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపానికి వేంచేపు చేసి స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ కారణంగా ఆర్జితసేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాన్ని తితిదే రద్దు చేసింది.



పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమిగానే ముందుకెళ్తాం: బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్

విశ్వంభర, విజయవాడ: పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమిగానే ముందుకెళ్తామని భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్ అన్నారు. ఈ ఎన్నికల్లోనూ ప్రజలు కూటమికి పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సమావేశమైన ఆయన.. గిరిజన నాయకుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి విజయం అందించిన రాష్ట్ర ప్రజలకు మాధవ్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధితో ముందుకు వెళ్తున్నామన్నారు. విశాఖలో జరిగిన సీఐఐ సదస్సు విజయవంతమైందని, దాదాపు రూ.9లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు.



కాకినాడ బీచ్‌లో నైజీరియా పర్యాటకుడి మృతి



విశ్వంభర, కాకినాడ: కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో ఆరుగురు నైజీరియన్లు సముద్ర స్నానానికి దిగారు. వీరిలో ప్రమాదవశాత్తూ ఫనెలె ఎన్కుబే అనే వ్యక్తి సముద్రంలో గల్లంతయ్యారు. మిగిలిన పర్యాటకులు కేకలు వేయడంతో అప్రమత్తమైన పోలీసులు.. స్పీడ్ బోటుతో రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన నైజీరియన్ ఎన్కుబేను కాసేపటి తర్వాత ఒడ్డుకు తీసుకొచ్చారు. బాధితుడికి సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయిందని పోలీసులు తెలిపారు. నైజీరియన్ మృతిపై కాకినాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా కార్యకర్తల జోలికి వస్తే.. చూస్తూ ఊరుకోం
మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



విశ్వంభర, రామాపురం : టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని, అందుకు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. రామాపురంలోని స్థానిక తెదేపా కార్యాలయంలోఆదివారం సాయంత్రం మంత్రి విలేకరులతో మాట్లాడారు. మాజీ శాసనసభ్యులు శ్రీకాంత్ రెడ్డి శిఖండి రాజకీయాలు చేస్తూ వైకాపా కార్యకర్తలను రెచ్చగొట్టి.. తెదేపా కార్యకర్తలపై దాడి చేయిస్తున్నారని అన్నారు. కార్యకర్తలపై కాదు ప్రజా క్షేత్రంలో తనతో తేల్చుకోవాలని సవాలు విసిరారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో తొలి రోజు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో రామాపురం, రాయచోటి మండలంలో తెదేపా కార్యకర్తలపై పోలీసులు, వైకాపా కార్యకర్తలు దాడికిపాల్పడ్డారని మంత్రి అన్నారు.కార్యకర్తలపైన దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఈ విషయంపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని మంత్రి తెలిపారు.

అశ్రునయనాల మధ్య నటుడు గిరిబాబు అంత్యక్రియలు పూర్తి



విశ్వంభర, ఒంగోలు: ప్రముఖ నటుడు గిరిబాబు అంత్యక్రియలు ఆయన స్వగ్రామం రావినూతలలో బంధు, మిత్రుల అశ్రునయనాల మధ్య ముగిశాయి. కుటుంబ సభ్యులు,బంధువులు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రకాశం జిల్లా రావినూతలలోని ఆయన నివాసం నుంచి మహా ప్రస్థానం వరకు అంతిమయాత్ర సాగింది. గ్రామస్థులు, బంధువులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నటుడు రఘుబాబు తన తండ్రి చితికి తలకొరివి పెట్టడంతో గిరిబాబు అంతిమ సంస్కారాలు పూర్తయ్యాయి. అంతకుముందు పలువురు ప్రముఖులు ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన వైఎస్ షర్మిల



విశ్వంభర, హైదరాబాద్: ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబును ఆది వారం హైదరాబాద్ లో కలిశారు.తన కుమార్తె అంజలి ెండ్డి వివాహ వేడుకకు విచ్చేసి... కాబోయే వధూవరులను ఆశీర్వ దించాలనికోరుతూ ఆ హ్వానపత్రిక అందజేశారు.

వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి అబ్దుల్‌కలాం ఇంటర్నేషనల్ స్కూల్: నారాయణ



విశ్వంభర, నెల్లూరు: నెల్లూరు జిల్లాలోని పలు మున్సిపల్ స్కూళ్లను కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో అభివృద్ధి చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు. నెల్లూరులో రూ.20 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు. జిల్లాలో రూ.550 కోట్లతో చేపట్టిన తాగునీటి పథకం పనులు పూర్తవుతున్నాయని, డిసెంబర్ నాటికి ప్రతి ఇంటికీ మినరల్ వాటర్ ఇస్తామని అన్నారు.

ఆదోని పట్టణంలో తప్పిన ప్రమాదం



విశ్వంభర, ఆదోని : కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో లంగర్ బావి వీధి కూడలిలో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆదివారం మధ్యాహ్నం ప్రధాన విద్యుత్ సరఫరా చేసే తీగ తెగి కింద పడింది. మార్కెట్ ప్రాంతం కావడంతో ఆదివారం జనం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ తీగను సరిచేశారు. ఇదే ప్రాంతంలో రెండోసారి విద్యుత్ తీగ తెగిపడటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.

వరాహ నదిలో గల్లంతైన ముగ్గురు యువకుల మృతి

విశ్వంభర, ఎస్.రాయవరం: అనకాపల్లి జిల్లాల్లో వరాహ నదిలో స్నానానికి దిగి గల్లంతైన ముగ్గురు యువకులు మృతిచెందారు. ఆదివారం ఉదయం వారి మృతదేహాలను గుర్తించారు. ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు వద్ద శనివారం వరాహ నదిలో ఆరుగురు యువకులు స్నానానికి దిగారు. ముగ్గురు సురక్షితంగా బయటకు రాగా.. కాతేటి రిషి (18), ముప్పిడి నాగవంశీ (22), కోడి జగదీశ్ (20) గల్లంతయ్యారు. నదిలో ముమ్మరంగా గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం వారి మృతదేహాలు నదిలో తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు, పోలీసులు బయటకు తీసుకొచ్చారు. యువకులు క్షేమంగా తిరిగి వస్తారని ఎదురుచూడగా.. విగతజీవులుగా మారడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతదేహాలను తహసీల్దార్ రమేశ్‌బాబు, సీఐ రామకృష్ణ, ఎస్సై రమేశ్ పరిశీలించారు. మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని దళిత కాలనీవాసులు కోరారు.

ఏపీకి తుపాను ముందస్తు హెచ్చరిక జారీ

విశ్వంభర, అమరావతి: బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. దీంతో ఏపీ, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు తుపాను ముందస్తు హెచ్చరిక జారీ అయింది. ప్రస్తుతం వాయుగుండం చెన్నైకి 840 కి.మీ దూరంలో, విశాఖకు 1,010 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని తీవ్రత పెరిగి ఉత్తర వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. దక్షిణ, మధ్య పశ్చిమ బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం ఉందని, ఆ తర్వాత ఏపీ తీరప్రాంతం వైపు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని పేర్కొంది.

జీలుగుమిల్లిలో పెద్దపులి సంచారంతో కలకలం



విశ్వంభర, జీలుగుమిల్లి: ఏలూరు జిల్లా జీలుగుమిల్లిలో పెద్దపులి సంచారం కలకలం సృష్టిస్తోంది. శనివారం రాత్రి మండల కేంద్రంలోని పాలచర్ల వెళ్లే దారిలో సీసీ కెమెరాలో పెద్దపులి కదలికలు రికార్డయ్యాయి. దీంతో పరిసర గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల ఆవుపై పులి దాడి చేసి హతమార్చిన విషయం తెలిసిందే.